# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 149    సోమవారం | 11 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




8లో..

## మాజీ సీఎం కేసీఆర్‌కు పరామర్శ

మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి



# తీర్పు విలక్షణం

వివరాలు 2లో..




తెచ్చిన, ఇచ్చిన పార్టీలకే పగ్గాలు

నాడు ఉద్యమ నేత కేసీఆర్ వైపు..

నేడు రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు పట్టం..

కృతజ్ఞత చాటిన తెలంగాణ ప్రజలు

ఎన్నికలు వచ్చిన ప్రతిసారి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గొప్పగా చెప్పుకునే మాట .. తెలంగాణ తెచ్చింది బీఆర్ఎస్ అంటే.. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని.. అందుకేనేమో తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలకు ఇప్పుడు న్యాయమైన తీర్పునిచ్చారు. తెలంగాణ ప్రజలు తెగించి కొట్లాటడమే కాదు.. తమ చిర కాల స్వప్నం సాకారం చేసిన వారికి కృతజ్ఞతలు చూపడం కూడా తెలుసు. ఆనాడు తెలంగాణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధ పడ్డ ఉద్యమ సారథి కేసీఆర్‌ను రెండు సార్లు ముఖ్యమంత్రిని చేసి మురిసిపోయారు. ప్రజల పక్షాన నిలబడిన బీఆర్ఎస్‌ను అందలమెక్కించారు. కానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించలేదని భావించి.. నేడు తెలంగాణ స్వరాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి అండగా నిలబడి కాంగ్రెస్ పార్టీకి అధికారమిచ్చారు. ఇలా తెలంగాణ తెచ్చిన, ఇచ్చిన పార్టీలకే పాలన పగ్గాలు అప్పజెప్పి ఇక్కడి ప్రజలు తమ విధేయతను చాటుకున్నారు.

- ప్రత్యేక ప్రతినిధి, వరంగల్ వాయిస్

2లో



## మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

8లో



## హామీలు అన్నీ అమలు చేస్తాం

పరకాల ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయ

ఎమ్మెల్యే రేవూరి కృతజ్ఞత ర్యాలీ

ఆరు గ్యారెంటీలలో రెండు పథకాలు అమలు

విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

8లో



## వర్ధన్నపేటలో రాజీవ్ ఆరోగ్య శ్రీ ప్రారంభం

గవర్నమెంట్ హాస్పిటల్‌లో ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

# తీర్పు .. విలక్షణం

**తెచ్చిన, ఇచ్చిన పార్టీలకే పగ్గాలు**

**నాడు ఉద్యమ నేత కేసీఆర్ వైపు..**

**నేడు రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు పట్టం..**

**కృతజ్ఞత చాటిన తెలంగాణ ప్రజలు**

**తెలంగాణ ప్రజలు తెగించి కొట్లాటడమే కాదు.. తమ చిర కాల స్వప్నం సాకారం చేసిన వారికి కృతజ్ఞతలు చూపడం కూడా తెలుసు. ఆనాడు తెలంగాణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధ పడ్డ ఉద్యమ సారథి కేసీఆర్‌ను రెండు సార్లు ముఖ్యమంత్రిని చేసి మురిసిపోయారు. ప్రజల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్‌ను అందలమెక్కించారు. కానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించలేదని భావించి.. నేడు తెలంగాణ స్వరాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి అండగా నిలబడి కాంగ్రెస్ పార్టీకి అధికారమిచ్చారు. ఇలా తెలంగాణ తెచ్చిన, ఇచ్చిన పార్టీలకే పాలన పగ్గాలు అప్పజెప్పి ఇక్కడి ప్రజలు తమ విధేయతను చాటుకున్నారు.**

**ప్రత్యేక ప్రతినిధి, వరంగల్ వాయిస్.:** స్వరాష్ట్ర ఆకాంక్షతో అలుపెరగని పోరాటంతో తెలంగాణ ప్రజలు అలసిసొలసి పోతే.. తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు పోరాడుతానని కదనరంగంలోకి దూకి ఉద్యమం చేసిన కేసీఆర్ వెంట నడిచి పోరు సలిపారు. 1969లో తొలిదశ తెలంగాణ ఉద్యమ పోరాటంలో జరిగిన పొరపాట్లను ఆత్మపరిశీలన చేసుకొని ఉద్యమాన్ని నయా పంథాలో ముందుకు తీసుకెళ్లారు. ఈ ఉద్యమానికి నాయకుడిగా కేసీఆర్ ను భావించి పోరాడారు. తెలంగాణ స్వరాష్ట్రం ప్రకటన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తానంటే ఆ మన వెంట నడిచారు. ఇలా ఉద్యమంలో ప్రతి అడుగులో తెలంగాణ ప్రజలు కేసీఆర్ ను కాదనలేదు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రెండు పర్యాయాలు ఉద్యమ పార్టీకి పట్టం కట్టి కేసీఆర్ ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొబెట్టారు.




### అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కేసీఆర్ ..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అసాధ్యమని అప్పటి రాజకీయ పక్షాలు వ్యంగ్యాస్త్రాలు సంధించినా.. వాటన్నింటిని పట్టించుకోకుండా తెగించి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. లక్ష్యాన్ని ముద్దాడే వరకు ఆగేది లేదంటూ కదనరంగంలోకి దూకి తన వ్యూహాలు నిత్యం మారుస్తూ రాజకీయ పక్షాలన్నింటికి ముచ్చెమటలు పట్టించిన ధీరుడు కేసీఆర్. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కేవలం కేసీఆర్ వల్లే సాధ్యమవుతుందని నమ్మిన తెలంగాణ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు చావు నోట్లో తలపెట్టిన నాయకుడు కేసీఆర్ అంటే అతిశయోక్తి కాదు. అందుకు తెలంగాణ ఉద్యమంలోని ప్రతి ఘట్టంలో తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారు. ఈ నమ్మకమే 2014లో తెలంగాణ ప్రత్యేక ఏర్పాటుకు పునాదులు పడ్డాయి.



### రెండు సార్లు పాలన పగ్గాలు..

తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు తమ విధేయత చాటుకున్నారు. తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ నేత కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారు. కేసీఆర్ పాలనతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని నమ్మి కేసీఆర్ కు అండగా నిలిచారు. ఈ కాలంలో కేసీఆర్ జనరంజకపాలన సాగించి ఇక్కడి ప్రజల మన్ననలు పొందారు. 2018 ఎన్నికల్లో కూడా మరోసారి తెలంగాణ ప్రజలు కేసీఆర్ కు మద్దతు పలికి రెండో సారి అధికారం అప్పజెప్పారు.

### ప్రజల నమ్మకం కోల్పోయిన ఉద్యమ నేత

రెండు సార్లు అధికారం అప్పజెప్పినప్పటికీ తెలంగాణ ప్రజల ఆశలను వమ్ము చేశారనే కారణంతో ప్రజలు కేసీఆర్ పై గుర్రుగా ఉన్నారు. అవినీతి ఆరోపణలు, నియంతృత్వ పోకడలు, నిరుద్యోగుల పట్ల వ్యవహరించిన తీరు ప్రజల ఆగ్రహానికి ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. పదేళ్ల కాలంలో కేసీఆర్ నేరుగా ప్రజలను కలిసింది చాలా తక్కువ సార్లు. కేసీఆర్ కేవలం ఫాంహౌస్ కే పరిమితం కావడం, ప్రగతిభవన్ కు ఎవరిని రానివ్వకపోవడం లాంటివి ఇక్కడి ప్రజలను ఆలోచింపజేశాయి. దీంతో హ్యాట్రిక్ సాధిద్దామనుకున్న కేసీఆర్ తో పాటు, బీఆర్ఎస్ పార్టీపై ఉన్న ఆగ్రహం అంతా ఓట్ల రూపంలో చూపించి గద్దె దించారు. తండ్రి కొడుకుల అహంకారం, కేసీఆర్ నియంతృత్వ పోకడలే ఆ పార్టీ కొంప ముంచాయి.

### కాంగ్రెస్‌కు పట్టాభిషేకం..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమ సారథి కేసీఆర్ ది ఎంత పాత్ర ఉందో.. తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అంతే పాత్ర ఉందని ఇక్కడి ప్రజలు బలంగా నమ్మారు. తమ పార్టీని సైతం పణంగా పెట్టి తెలంగాణను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ త్యాగాన్ని గుర్తించారు. తమ కోసం అండగా నిలిచిన ఆ పార్టీని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి పట్టాభిషేకం చేశారు. తెలంగాణ ప్రజల మనస్సుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక స్థానం ఉందంటూ నిరూపించారు. పదేళ్లు కేసీఆర్ తెలంగాణ రక్షణగా నిలబడాలని గెలిపిస్తే.. నేడు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞత తెలిపేందుకు గెలిపించారు. ఏదిఏమైనా తెలంగాణ ప్రజల తీర్పు విలక్షణం అంటూ విశ్లేషకులు సైతం చెబుతున్నారు.

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే మహాలక్ష్మి పథకాన్ని హనుమకొండ బస్టాండ్ లో సోమవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకంతో మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించేందుకు వీలుంటుందన్నారు. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహాలక్ష్మి పథకాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆర్టీసీ బస్సు ముందు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆర్టీసీ బస్సు కండక్టర్ కు డబ్బులు చెల్లించి టికెట్ ను తీసుకొని ఆర్టీసీ బస్సులో ఎక్కి మహిళలతో కలిసి కొద్ది దూరం ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ ఆర్ఎంవో భాను కిరణ్, డిప్యూటీ ఆర్ఎంఎం మాధవరావు, హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరం సింగ్, వరంగల్ – 2 డిపో మేనేజర్ సురేష్, ట్రాఫిక్ సూపర్ వైజర్ నజియా సుల్తానా, మెకానికల్ సూపర్ వైజర్ చంద్రశేఖర్, సజ్జన్ నాయక్, నేతలు ఎండీ అజీజ్ ఖాన్, ఈవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# టీటీఏ అధ్వర్యంలో మెడికల్ క్యాంప్

**జిమ్నాస్టిక్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి రూ. 5 వేలు అందజేసిన వంశీ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు కళల తోట తెలంగాణ సేవల కోట అనే నినాదంతో 2015లో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ స్థాపించబడింది . తెలంగాణ తరుపున విదేశాలలో ఏర్పడిన మొట్టమొదటి సాంస్కృతిక సంస్థ తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ టీటీఏ వ్యవస్థాపకుడు పైళ్ల మల్లా రెడ్డి, సలహా కాన్సుల్ చైర్ విజయపాల్ రెడ్డి, సహాధ్యక్షుడు మోహన్ పట్లోల్ల, సభ్యుడు భరత్ మదాడి ఆధ్వర్యంలో 2015లో మొదలై, ప్రస్తుత ప్రెసిడెంట్ వంశీరెడ్డి కంచరకుంట్ల ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్న తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగు రాష్ట్రాలలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే సేవా డేస్ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా నిర్వహించ తలపెట్టింది. ఈ కార్యక్రమంలో విద్య ద్వారా ఉపాధి మార్గాలు, వ్యాపార వృద్ధితో ఆర్థిక వనరుల అభివృద్ధి, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక, జాబ్ ఓరియెంటెడ్, ఉపాధి కల్పన, యూత్, మహిళా సాధికారత కోసం చేసే అవేర్నెస్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తెలంగాణ అంతటా హైదరాబాద్, అచ్చంపేట, నల్గొండ దేవరకొండ, బోనగిరి, సిద్ధిపేట, వికారాబాద్, యాదగిరిగుట్టలలో ఉంటాయని తెలిపారు. ఈనెల 10నుంచి 23 వరకు ఉన్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రెసిడెంట్ వంశీరెడ్డి కంచరకుంట్ల, ప్రెసిడెంట్ ఎలెక్ట్ నవీన్ రెడ్డి మలిపెద్ది, సేవా డేస్ కార్యక్రమానికి కోఆర్డినేటర్ సురేష్ రెడ్డి వెంకన్న ప్రజలను కోరారు. ఇందులో భాగంగా సోమవారం టీటీఏ అధ్వర్యంలో మొదటి రోజు సేవా డేస్ కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ గౌట్ స్కూల్ మాసబ్ టాంక్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లల ఆట పాటలతో కార్యక్రమం ఆహ్లాదకరంగా మారింది. చిరంజీవి హారిక పడిన "యెట్టగయ్య శివ శివ " అనే పాట టీటీఏ సభ్యులను ఆకట్టుకుంది. విద్యార్థిని కీర్తన "పాటమ్మ తోనే " అనే పాట పాడారు. ఇద్దరికీ టీటీఏ నుంచి నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో పిల్లలకు డెంటల్ చెకప్, డెంటల్ కిట్స్, శానిటరీ పాడ్స్, ఉమెన్ అవేర్నెస్ ప్రోగ్రామ్, ప్రతి ఒక్కరికీ ఫ్రూట్ ఇవ్వడం జరిగింది. అమర దేవి అనే ఒక చిన్నారి జిమ్నాస్టిక్ లో గోల్డ్ మెడల్ సాధించిందని తెలుసుకున్న ప్రెసిడెంట్ వంశీ రెడ్డి కంచరకుంట్ల రూ.5వేల నగదు బహుమతిగా ఇచ్చి ఆశీర్వదించారు. రానున్నరోజుల్లో ఒలింపిక్స్ లో ఆడేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. అలాగే ప్రతిరోజూ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, 500మంది పిల్లలు పాల్గొన్నారు.





# ఐనవోలు మల్లన్నను దర్శించుకున్న నూతన ఎమ్మెల్యే



## ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, ఐనవోలు :** వర్ధన్నపేట శాసనసభ్యుడిగా అసెంబ్లీలో కేఆర్ నాగరాజు ప్రమాణ స్వీకారం చేసి సోమవారం మొట్టమొదటిసారిగా ఐనవోలు మల్లికార్జున స్వామి దర్శనానికి విచ్చేసిన సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వామివారి శేష వస్త్రాలను, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం తల్లి సోనియా గాంధీ ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని వారు జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ–రాజేశ్వరరావు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వర్ధన్నపేట నియోజకవర్గం కోఆర్డినేటర్ నమీండ్ల శ్రీనివాస్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్రావు, వెంకట నరసయ్య రెడ్డి, ఐనవోలు మండల అధ్యక్షుడు సమోట మహేష్ గౌడ్ తో పాటు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ చేయూతను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ఎన్నికల గ్యారెంటీ హామీల్లో భాగంగా సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆరోగ్య శ్రీ చేయూత పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వమే వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరిస్తూ ఒకొక్క కుటుంబానికి ఏడాదికి రూ.10లక్షల పరిమితితో అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిందని, ఈ పథకం ఈ నెల 9 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఇప్పటిదాకా ఈ పథకం కింద ఒకొక్క కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షల పరిమితి ఉండేదని, ఇప్పుడు దీన్ని రెట్టింపు చేశామని, ఇప్పుడు ఈ పథకం అన్ని ఆరోగ్య శ్రీ ఎం ప్యానల్ ఆసుపత్రుల్లో తక్షణమే అమల్లోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్ శ్రీమాన్, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబెర్ ఈవీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సే రైటింగ్‌లో విద్యార్థినికి బంగారు పతకం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టెవాడకె చెందిన ఎంజీఎం వద్ద గల మూడో గేటు ముందు చాయ్ అమ్ముతూ జీవించే పాష కూతురు అలీజా మైరాకు టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీ వారు నిర్వహించిన జిల్లా స్థాయిలో బంగారు పతకం వచ్చింది. ఈ సందర్భంగా ట్రస్ట్ వారు సోమవారం ఘనంగా అలీజా మైరాను సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్య వినయంతో పాటు సంస్కారం సమాజాభివృద్ధి వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా అమ్మాయి తల్లిదండ్రులకు తాతకు అభినందనలు తెలియజేశారు. అలాగే విద్యార్థిని సన్మానించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తండ్రి అఫ్జల్ పాష, జన్ను మాణిక్యం, శీను, శబరీ, ఖాదర్, రాము, యాకూబ్, శ్యామ్ పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు హర్షణీయం

### బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజా ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికల వాగ్దానాలను అమలు పరచడానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమని బీసీ హక్కుల సాధనసమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ప్రగతి భవన్ ను జ్యోతిరావు పూలే ప్రజా భవన్ గా మార్చి ఇనుప కంచెను బద్దలు కొట్టి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కృషి చేయడం అభినందనీయమన్నారు. నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు జరపడం , రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షల రూపాయలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లను 22శాతం నుంచి 42శాతానికి పెంచి గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్స్ సర్పంచుల ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేనిచో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల మెనీ ఫెస్టోలో ప్రకటించిన అంశాలు అన్నిటినీ ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం అమలుపరుస్తుందన్న ఆశాభావాన్ని వెంకట్రాములు వ్యక్తం చేశారు. ఉమ్మడివరంగల్ జిల్లా నుంచి మంత్రులుగా నియమింపబడిన కొండా సురేఖ, ధనసరి సీతక్క, జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కడియం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** చిల్పూర్ గుట్టపై కొలువై ఉన్న శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని సోమవారం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన పదికోట్లతో పాటుగా ఇంకా నలభై కోట్లతో దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న రోజుల్లో టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

## కాలనీల అభివృద్ధికి కృషి చేస్తాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 02వ డివిజన్ రెడ్డి పురంలోని జ్యోతిర్లింగాల కాలనీ, సాయి కృపా కాలనీ, విజయలక్ష్మి కాలనీ, హైటెక్ సిటీ, డాక్టర్స్ కాలనీ, అభినవ్ ఎన్ క్లే కాలనీల అభివృద్ధి కోసం సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో డెవలప్ మెంట్ కమిటీ అధ్యక్షుడిగా పసుల సంజీవ్, ఉపాధ్యక్షులుగా కే.బుచ్చిబాబు, కే.రాజు, జే.మోహన్, ప్రధాన కార్యదర్శిగా కలిమి మధు యాదవ్, ఉప కార్యదర్శిగా టి.మల్లయ్య, సంయుక్త కార్యదర్శి గా ఎండి రఫీ, కోశాధికారిగా బి.వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కే.కృష్ణారెడ్డి, పి.లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారులుగా ఎస్.రాములు, ఎస్.భాస్కరాచారి, డి.సదన్ కుమార్, కే.కనకయ్య, డి.మోహన్ లను కాలనీల వాసులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీల వాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అమలు జరుపుతామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించడం ఎంతో హర్షణీయమని వరంగల్ జిల్లా ఉద్యమకాల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం ఉర్సులో కన్వీనర్ మరుపల్ల రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది ఉద్యమకారులు తమ కుటుంబాన్ని తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో పాల్గొన్న వారి జీవన పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, ఆర్థికంగా చితికిపోయారని, నేడు చాలా ఇబ్బందులు పడుతున్నారని మరుపల్ల రవి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలను పోలీస్ శాఖ ద్వారా సేకరించి ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తారని సమావేశం ఆశాభవం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో ఉద్యమకారుల సంఘం బాధ్యులు ఎలగం సత్యనారాయణ, శంకేశి లింగమూర్తి, దిండిగాల సోమేశ్వర్, మెంతుల యాదగిరి, బత్తుల కుమార్, సోమ మధుకర్ లు పాల్గొన్నారు.

# వాసుదేవ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

## వికలాంగుల జాక్ కన్వీనర్ నల్లెల్ల రాజయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ దివ్యాంగుల సంక్షేమ సంఘం కన్వీనర్ సయ్యద్ అసద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన వి-జాక్ కన్వీనర్ నల్లెల్ల రాజయ్య పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర వికలాంగుల సమాజ సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వాస్తవంగా ఇప్పటి వరకు రాష్ట్రం లో ప్రజా ప్రభుత్వ పార్టీ తప్ప ఏ పార్టీ వికలాంగులకు తమ తమ పార్టీల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించలేదన్నారు. రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత ప్రస్తుత అధికార పార్టీకే దక్కుతుందన్నారు. నూతన ప్రజా ప్రభుత్వం కొలువు తీరగానే రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్, నూతన ముఖ్యమంత్రి వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ఇచ్చిన పత్రికా ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామని వి-జాక్ కన్వీనర్ నల్లెల్ల రాజయ్య తెలియ జేశారు . మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి రెండు దఫాలుగా వికలాంగుల సహకార సంఘ చైర్మన్ గా ఉండి వికలాంగులకు ఒరుగబెట్టిందేమీ లేదన్నారు. పదేండ్లుగా కేసీఆర్ పాదాక్రాంతుడై ఉత్సవ విగ్రహంలా ఉన్నాడే తప్ప, ఎంతో మంది డిగ్రీలు , పీజీలు చేసిన నిరుద్యోగ వికలాంగులకు రావలసిన బ్యాక్ లాగ్ ఉద్యోగాలు ఇప్పించలేకపోయాడని మండిపడ్డారు. ఇప్పుడేమో నూతన ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కల్పించాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదం అన్నారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసే అర్హత వాసుదేవ రెడ్డికి లేదని, భవిష్యత్ లో ఉండబోదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వాసుదేవ రెడ్డి వికలాంగులకు చేసిన తీరని ద్రోహానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సయ్యద్ అసద్, సంతోష్ పాల్గొన్నారు.

# కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కలెక్టరేట్ లో సోమవారం వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ను మర్యాద పూర్వకంగా కలిసి భేటీ అయ్యారు. ఈకార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రమేష్, కాజీపేట తహసీల్దార్ భావ్ సింగ్, రెడ్ క్రాస్ ఈసీ మెంబెర్ ఈవీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయినికి సీపీఐ అభినందనలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి హనుమకొండకు విచ్చేసిన నాయిని రాజేందర్ రెడ్డిని సోమవారం సీపీఐ నాయకులు హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్ లో కలిశారు.ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరారు. ముఖ్యంగా నియోజకవర్గం పరిధిలో వేలాది మంది పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండా దంపతులకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావులను శ్రీ కనకదుర్గ మాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు గంప శ్రవణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు జంగం ప్రభాకర్, గూడ గోవర్ధన్, గుండా నాగరాజ్, దౌడు నాగరాజ్ శేష వస్త్రాలతో సన్మానించి, అమ్మవారి ఫొటోలు బహూకరించారు. అనంతరం పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలిసి కొండా సురేఖ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖలు అభివృద్ధి పదంలో దూసుకుపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 55దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ వై.వి గణేష్, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు ఆగదు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను సోమవారం తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాడుగుల సంపత్ కుమార్, శ్రీపతి సంపత్ కుమార్, మంద సాగర్ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొంది, హుస్నాబాద్ కు మంత్రిగా వస్తున్న పొన్నంను చూసి స్థానిక ప్రజలు గర్వపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజులలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అదేవిధంగా ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచడం సంతోషమన్నారు. రాబోయే రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిగా ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేసిన మోసపూరితమైన వాగ్దానాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోదని చెప్పారు. రాబోయే రోజులలో జరిగే గ్రామపంచాయతీ ఎలక్షన్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 24న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లో ఉదయం 10-12 గంటల వరకు 1 నుంచి 10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించబడతాయని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విభాగాల వారీగా నిర్వహించబోయే ఈ పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేయడంతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి వారి ప్రతిభని నిరూపించుకోవాలని సూచించారు. వివరాలకు 8143643337 లో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

# ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉపాధి కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వన్నిక ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు వన్నిక ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సులో గల యువతీ, యువకులకు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ -నాన్-వాయిస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ ప్రోగ్రామర్ కోర్సులలో 3నెలల కాలానికి శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పూర్తి చేసిన వారు తమ విద్యా, కుల, ఆదాయ, ఆధార్, రేషన్ కార్డులతో పాటు రెండు ఫొటోలు జతపరచి హనుమకొండ అదాలత్ లోని స్వాప్టెక్ కంప్యూటర్ సెంటర్ లో దరఖాస్తు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9246899300/302/306 నెంబర్ లలో సంప్రదించాలని తెలిపారు.

# కేయూ పరిధిలో డిగ్రీ విద్యార్థులకు డిటెన్షన్ పద్ధతి ఎత్తివేయాలి

## ఎగ్జామినేషన్ బ్రాంచ్ కంట్రోలర్ గేటు ఎదుట విద్యార్థుల ధర్నా



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు డిటెన్షన్ పద్ధతిని ఎత్తివేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ ఆధ్వర్యంలో ఎగ్జామినేషన్ బ్రాంచ్ కంట్రోలర్ గేటు ముందు విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులు ఒక సంవత్సరంలో మూడు లేదా నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ అయితే డిటెన్షన్ అనే పద్ధతిని కంటిన్యూ చేస్తున్నారని, కాబట్టి ఎంతోమంది పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. వెంటనే ఈ డిటెన్షన్ అనే పద్ధతిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు కిరణ్, చెట్టుపల్లి శివకుమార్, సిద్దు, అనుఫ్, రాజ్ కుమార్, వెంకటేష్, రఘురాం, రాకేష్, భారత్, వినీత్, ఉదయ్, కృష్ణ, సాత్విక్, రాజేష్, సుఖేష్, నవీన్, సుఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల ఉల్లంఘన నేరం

## అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** భ్రూణ హత్యలు, మానవ అక్రమ రవాణా మొదలైనవి మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి అన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడడం నేరమని, చట్టవిరుద్ధమని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహబూబాబాద్ వారు డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఈదులపూసపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రవేశపెట్టిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం యావత్తు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రజలకు నిత్యజీవితంలో ఉపయోగపడే ఎన్నో చట్టాల గురించి జడ్జి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు, అడ్వకేట్స్ తాటిపాముల సునీత, మోహన్, ఈదులపూసపల్లి వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కోర్ట్ కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 32వ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో అండర్ రైల్వే గేట్ ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించాలని వరంగల్ లోకల్ డిపో మేనేజర్ దరంసింగ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ రవి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సందీప్, ముఖ్య నాయకులు మంద శ్యామ్, 40వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్, రామగిరి శోభన్ బాబు, యాదగిరి, బతీని సతీష్, రవి, ముద్దసాని మహేష్, శ్యామల సత్య, మహిళా అధ్యక్షురాలు కేదారి పద్మ, అనూష, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 14న జాబ్ మేళా

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఉపాధి, శిక్షణ శాఖ మహబూబాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదర్శ ఆటో మోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మహబూబాబాద్ కంపెనీలో మహబూబాబాద్ డోర్నకల్, తొర్రూరు ప్రదేశాల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ గా రూ.12 వేల నుంచి 15 వేల పారితోషకంతో పనిచేయుటకు ఇంటర్ ఆపైన విద్యార్హతగా కలిగి 21 సంవత్సరాల పైబడిన పురుష అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 14న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, మహబూబాబాద్ లోని రెండవ అంతస్తు రూమ్ నెంబర్ 25లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ సోమవరం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు పైన తెలిపిన అడ్రస్ లో జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సంస్థ మేనేజర్ రోహన్ పటేల్ 8886192222 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరని తెలిపారు.

## 13న పాగాల సంపత్ రెడ్డి సంతాప సభ



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ నెల 13న పాగాల సంపత్ రెడ్డి సంతాప సభ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, పాగాల సంపత్ రెడ్డి అభిమానులు అందరూ తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. స్వర్గీయ శ్రీ పాగాల సంపత్ రెడ్డి గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# మెట్టుగుట్ట పై కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, మడికొండ :** ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవస్థానములలో కార్తీక మాసం చివరి సోమవారం మాస శివరాత్రి సందర్భంగా ఉదయం శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, అనంతరం యాగ శాలలో గణపతి నవగ్రహ సహిత రుద్రహోమం నిర్వహించారు. తదుపరి భక్తులచే అభిషేకములు జరిపించారు. తదుపరి శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రామాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంకాలం సూర్యాస్తమయం అనంతరం





స్వామి వార్లకి ఆకాశ దీపోత్సవం నిర్వహించి, ప్రదోషకాల రుద్రాభిషేకం చేసి, లక్ష బిల్వార్చన చేసి విశేషంగా అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 12న కార్తీకమాసం చివరి మంగళవారం సందర్భంగా శ్రీ స్వామి వారికి శుద్ధమైన నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించి, మధ్యాహ్నం 54కిలోలతో అన్నాభిషేకం చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో కే.శేషు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ సమస్యలు పరిష్కరించాలి

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతి

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వీఆర్ఏల సమస్యలు పరిష్కరించి చేస్తున్న పనులకు ఐడీ కార్డులు అందజేసి నెలనెలా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతినెల వేతనాలు అందించేలా వీఆర్ఏలను ఆదుకోవాలని వీఆర్ఏజేఏసీ తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు దూగుంట్ల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గంలోని తొర్రూరు డివిజన్ కేంద్రానికి తొలిసారి వచ్చిన సందర్భంగా వీఆర్ఏ జేఏసీ తొర్రూరు డివిజన్ కమిటీ యశస్విని రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి వీఆర్ఏ లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 23వేల మంది వీఆర్ఏలను వివిధ శాఖలలోకి పురమాయించి కనీసం ఆ శాఖల తరఫున ఐడీ కార్డులు కూడా అందజేయకపోవడమే కాకుండా జీతాలు లేక అనేక



ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నూతన ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వినతి పత్రం తీసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే ఝాన్సీ యశస్విని రెడ్డి స్పందించి మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకునేలా నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ నాయకులు మురళీ, ఉపెంద్ర, నవీన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి దేవాలయంలో ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని మహబూబాబాద్ రోడ్డులోని హరి హరక్షేత్రం అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ దేవాలయంలో కొలువై ఉన్న సాక్షాత్తు సత్యనారాయణ స్వామి దేవాలయం ఎదుట కార్తీకమాస సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించామని ఆలయ నిర్వాహకులు దారం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రత పూజలు ఆచరించారు. మన ప్రాంతంలో ఉన్న ఏకైక సత్యనారాయణ స్వామి ఆలయం తొర్రూరు హరి హర క్షేత్రం అయ్యప్ప దేవాలయంలోని కొలువై ఉందని, ప్రతి భక్తులు ఈ ఆలయంలో ఏ రోజైనా ఉచితంగా సత్యనారాయణ వ్రతం చేసుకొవచ్చన్నారు. భక్తులు, స్వాములు అయ్యప్ప స్వామి దేవాలయం దర్శనం చేసుకొని కన్నెమూల గణపతి, మాలికాపురత్తమ్మ, సుబ్రహ్మణ్యస్వామి, నాగరాజు, సత్యనారాయణ స్వామి, రామలింగేశ్వరుడు, సరస్వతి, హనుమాన్ దేవతలను దర్శించుకోని ఆయా దేవతల ఆశీస్సులు పొందాలన్నారు.

## త్రికూటేశ్వర ఆలయానికి స్టీల్ మెట్ల బహూకరణ

### దోమ కుంట్ల స్వరూపారాణి దాతృత్వం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముత్తారం గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన అతి ప్రాచీనమైన త్రికూటేశ్వర ఆలయం దాతల సహకారంతో నూతన శోభను సంతరించుకుంటోంది. నాటి కాలంలో నిర్మించిన పెద్ద రాతి మెట్ల ద్వారా దైవ దర్శనానికి వెళ్లాలంటే భక్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. వృద్ధులు, మహిళలు, పిల్లలు ఆలయ పైభాగానికి చేరాలంటే చాలా ఇబ్బంది పడవలసి వచ్చేది. విషయాన్ని తెలుసుకున్న భక్తురాలు దోమకుంట్ల స్వరూపరాణి, ఆమె కుమారులు సంతోష్ –కవిత, సతీష్ –గౌరీ సుమారు రూ.50 వేలతో స్టీలు మెట్లను నిర్మించి ఆలయానికి బహూకరించారు. దీంతో భక్తులకు సులభంగా దర్శన భాగ్యం కలుగుతున్నది. దర్శనానికి వచ్చిన భక్తులు దాతలు సరూపారాణి దాతృత్వాన్ని కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారి కుటుంబాన్ని ఘనంగా సత్కరించి, ఆ పరమశివుని కృప ఎల్లప్పుడూ వారి మీద ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సోమవారం ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగూడ గ్రామపంచాయతీ కి చెందిన కొంతమంది రైతులు తాము సాగుచేసుకుంటున్న భూమికి ఆర్వోఎఫ్ఆర్ హక్కు పత్రం ఇప్పించాలని కోరారు. కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామ రైతులు తమ గ్రామ చెరువు క్రింద 150ఎకరాల్లో రైతులు సాగు చేసుకుంటున్నారని, రబీ పంటకు గాను కెనాల్ కాలువల నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. గూడూరు మండలం నాయకపల్లి గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ పంటల సాగుకు అవసరమైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ రిపేరులో ఉండి పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేపట్టి ఆదుకోవాలని కోరారు. డోర్నకల్ మండలం లింబ్యా తండా గ్రామానికి చెందిన సర్పంచ్ బాదావత్ బాలాజీ 2022-23సంవత్సరంలో ఎస్ డీఎఫ్ నిధుల క్రింద అంగన్ వాడీ ప్రహారీ గోడకు సాంక్షన్ అయిన నిధులు ఆ ప్రహారీ గోడకు స్థలం సరిపోయేందుకు లేదని, కాబట్టి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేయుటకు అనుమతించాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన (62) దరఖాస్తులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారం కోసం ఆదేశించారు. ఈ ప్రజావాణిలో జడ్పీ సీఈఓ రమాదేవి, జిల్లా అధికారులు, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయినికి శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని జర్నలిస్టులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి సదయ్య, కోశాధికారి అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం కుమార్, బొడిగె శీను, సహాయ కార్యదర్శిలు సంపేట సుధాకర్, విష్ణు కార్యవర్గ సభ్యులు దిలీప్, శ్రీకాంత్, ఆంజనేయులు, రాజుస్వామి పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఎనుముల రేవంత్ రెడ్డిని వారి స్వ గృహంలో హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గొర్రెకుంట విద్యార్థులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 10న ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరంగల్ పట్టణంలోని శంభునిపేట క్రీడా ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి వాలీబాల్ పాఠశాలల ఎంపిక క్రీడా పోటీలలో గీసుకొండ మండలం 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని వారి క్రీడా ప్రతిభతో ఎల్ అన్షు, కె.సౌమ్యలు ఈ నెల 13, 14, 15వ తేదీలలో నారాయణపేట పట్టణంలో జరుగు రాష్ట్రస్థాయి వాలీబాల్ పాఠశాలల క్రీడలకు(14 ఏళ్ల విభాగం) ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నలిమెల జ్యోతిర్మయి, పీఈటీ జలగం రఘువీర్ తెలిపారు. తమ క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎల్.అన్షు, కె.సౌమ్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, స్థానిక కార్పొరేటర్ ఆకుల మనోహర్, విద్యా కమిటీ చైర్మన్ జున్ను కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం షహీన్ సుల్తాన, యం.చంద్రశేఖర్, మార్త శ్రీనివాస్, సీహెచ్ అనిత, పి.ప్రణతికుమారి, యం.ప్రభాకర్, జే.దమరి, ఆర్.రాజు, సీహెచ్ శ్రీదేవి, పీఈటీ జె.రఘువీర్ గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

## ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 4వ డివిజన్ జ్యోతిరావ్ పూలే కాలనీ లోటస్ ప్రాంతంలో సోమవారం సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారత సాధనలో భాగంగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్ తెలియజేశారు. సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్ మాట్లాడుతూ నిరుపేద మహిళలకు 3నెలలు శిక్షణ అందించి, అనంతరం వారికి బ్యాంక్ లింకేజ్ కల్పించడం జరుగుతుందన్నారు. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా మహిళా సాధికార కోసం సేవలు అందిస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్ మాట్లాడుతూ గత సంవత్సరం కాలం నుంచి ఏడు విడతలుగా మహిళలకు కుట్టు శిక్షణ అందించి ఇప్పటి వరకు 15 కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పరికి సుధాకర్, టీచర్ పద్మ, మహిళలు, వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్లను ప్రారంభించిన అజీజ్ ఖాన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా గ్రంథాలయ సంస్థ హనుమకొండలో రూ.12లక్షలతో గ్రంథ పాఠకుల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మించగా సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేశిజ దేవీ, జూనియర్ అసిస్టెంట్స్ సంతోష్ , కుమారస్వామి, రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రంథ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఏ అజీమ్ మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ ను సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంఏ అజీమ్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజక ప్రజలందరూ కలసికట్టుగా డాక్టర్ మురళి నాయక్ ను 50వేల భారీ మెజారిటీతో గెలిపించుకోవడం జరిగిందన్నారు. మురళి నాయక్ గెలుపు కోసం కృషి చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో అందరం కలిసికట్టుగా మహబూబాబాద్ ఎమ్మెల్యే నాయకత్వంలో మహబూబాబాద్ నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ముస్లిం సమాజం ఎంతో వెనుకబడి ఉందని, కాబట్టి ముస్లిం సమాజాభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్రవ్యాప్తంగా మద్దతు తెలిపిందన్నారు. కాబట్టి ముస్లింలకు రావాల్సిన హక్కులను తప్పనిసరిగా నెరవేరేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్ పీఎస్ యూత్ నాయకులు రియాజ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## మన అంబేద్కర్ రాష్ట్ర అధ్యక్షుడిగా బుట్టి రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర మన అంబేద్కర్ యువజన సంఘం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రతి సంవత్సరం సంఘం అధ్వర్యంలో డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరణ చేస్తూ, ఉచిత బహుజన వివాహ పరిచయ వేదికలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సంఘం ముఖ్య సలహాదారులు కామద్రి కనకయ్య, బొల్లెపెల్లీ రాజయ్య సూచన మేరకు మన అంబేద్కర్ రాష్ట్ర అధ్యక్షుడిగా బుట్టి రంజిత్ కుమార్, జాతీయ అధ్యక్షుడిగా కుంచం సాయిలును ఎంపిక చేశారు. వీరి ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.













# ఈ వారం చిన్న చిత్రాల హవా


## థియేటర్లలోకి వస్తున్న పలు సినిమాలు

ఈ ఏడాది చివరికి చేరుకుంది. నెలాఖరులో పెద్ద చిత్రాలు 'సలార్' 'డంకీ' లాంటి చిత్రాల హవా ఉండడంతో చిన్న చిత్రాలు అన్ని ఈ వారం విడుదలకు వరుస కట్టాయి. ఈ వారం థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సినిమాల్లో జోరుగా హుషారుగా... ఒకటి. విరాజ్ అశ్విన్ హీరోగా అను ప్రసాద్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జోరుగా హుషారుగా'. పూజిత పొన్నాడ కథానాయిక. 'బేబీ'తో పాపులర్ అయిన విరాజ్ నటిస్తున్న చిత్రమిది. పోస్టర్స్, ట్రైలర్స్ మెప్పించేలా ఉన్నాయి. ఈ నెల 15న విడుదల కానున్న ఈ చిత్రం చక్కని విజయం అందుకుంటుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఇకపోతే 'పిండం' చిత్రంతో ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు హీరో శ్రీరామ్. సాయికిరణ్ దైదా తెరకెక్కించిన ఈ చిత్రానకి యశ్వంత్ దగ్గుమాటి నిర్మాత. ఈ నెల 15న థియేటర్లలోకి వస్తోంది.. 'మరణం అనేది నిజంగానే అంతమా? మరణించిన తర్వాత ఏం జరుగుతుంది అనేది ఎవరైనా చెప్పగలరా? కోరికలు తీరని వారి ఆత్మలు ఈ భూమ్మీద నిలిచిపోతాయా? ఆ ఆత్మలు నిజంగానే మనకు హాని చేయగలవా? అన్న అంశాలతో సస్పెన్స థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతోంది. ఈశ్వరీరావు, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అన్ని డిసెంబరు 15న థియేటర్లలోకి రానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అనూహ్య స్పందన వచ్చింది. తికమక తాండ .. కవలలు హరికృష్ణ, రామకృష్ణ కథానాయకులుగా నటించిన చిత్రం 'తికమక తాండ'. యాని, రేఖ నిరోష కథానాయికలు. వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. 'ఒక ఊరి నేపథ్యంలో సాగే కథ ఇది. తికమక తాండా అని ఆ ఊరిని ఎందుకన్నారనేది తెరపైనే చూడాలి' చిత్ర బృందం చెబుతోంది.క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'చే'. లాంగ్ లైవ్ అనేది ట్యాగ్ లైన్. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్‌పై బి.ఆర్ సభావత నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ 15న ఈ చిత్రం విడుదల కానుంది.

### పిండం సినిమాకు ఎ సర్టిఫికెట్

ఒకరికి ఒకరు ఫేమ్ శ్రీరామ్ నటిస్తున్న తాజా చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. కుశీ రవి  హీరోయిన్‌గా నటిస్తుండగా.. సాయికిరణ్ దైదా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక సాయికిరణ్‌కు ఇదే మొదటి మూవీ. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్, ట్రైలర్‌లు విడుదల చేయగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ మూవీకి 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ.. ఈ సినిమాను గర్భిణీ స్త్రీలు చూడవద్దని సెన్సార్ బోర్డు హెచ్చరిక జారీచేసినట్లు తెలిపింది.

## నా సామి రంగా నుంచి పాట విడుదల



సంక్రాంతికి 'నా సామిరంగా' చిత్రంతో సందడి చేయబోతున్నారు నాగార్జున. విజయ్ బిన్నీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆషికా రంగనాథ్ కథానాయిక. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఆదివారం 'నా సామిరంగ' నుంచి 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే... రమణి ముద్దుల గుమ్మ నందనా' అంటూ సాగే తొలి గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. చంద్రబోస్ సాహిత్యానికి ఎంఎం కీరవాణి స్వరాలు సమకూర్చారు. రామ్ మిరియాల ఆలపించారు. ప్రసన్నకుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, మాటలు అందిస్తున్నారు.





## డెవిల్ ఫస్ట్ లుక్ విడుదల

నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డెవిల్. ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తుండగా.. స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన కల్యాణ్‌రామ్, మాళవిక నాయర్, ఎల్నాజ్ నౌరౌజీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లతో పాటు డెవిల్ టీజర్.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ మూవీ నుంచి కొన్నాళ్లుగా ఎలాంటి అప్‌డేట్స్ రాలేదు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొత్త న్యూస్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం నయా అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ మూవీ ట్రైలర్‌కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను డిసెంబర్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఇక ఈ సినిమాను డిసెంబర్ 29న పాన్ ఇండియా లెవల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దేశ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా డెవిల్ ముసుగేసుకుని బ్రిటీషర్ల కోసం కళ్యాణ్‌రామ్ ఎందుకు పని చేశాడనే కాన్సెప్ట్‌తో పీరియాడిక్ స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. లుక్స్ పరంగా కళ్యాణ్ రామ్ కూడా ఈ సినిమాలో చాలా బాగున్నాడు.





# మాజీ సీఎం కేసీఆర్‌కు పరామర్శ

## కలిసిన మాజీ మంత్రులు
## సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి

**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో ట్రీట్ మెంట్ పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ ను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించారు. సోమవారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మహబూబాబాద్ జడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోత్ బిందుతో కలిసి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ యశోద ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసీఆర్ గారితో మాట్లాడిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కు తన ఆరోగ్యం బాగానే ఉందని అందరూ ధైర్యంగా ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ తెలిపారు.

### గండ్ర వెంకటరమణా రెడ్డి పరామర్శ..

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిన కేసీఆర్ నుభూపాలపల్లి నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు గండ్ర వెంకట రమణా రెడ్డి సోమవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ర్ఘావాలని ఆకాంక్షించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సోమవారం వివిధ విభాగాలకు చెందిన (25)దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం, నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో అధికారులకు, సిబ్బందికి జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను ప్లాస్టిక్ రహితంగానూ, పర్యావరణ హితంగానూ మార్చేందుకు అందరం కంకణ బద్ధులై ఉండాలని, చేతి సంచినే వాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓలు మురళీ కృష్ణ, వి.రాంమూర్తి, జిల్లా అధికారులు, జిల్లా హరిత దళ సమన్వయకర్త గౌసియా, కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రవీందర్ పాల్గొన్నారు.

# అవయవ దానం అత్యున్నతమైన దానం

## మానవత్వంతో అమరత్వం | డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** అన్ని దానాల్లోకెల్లా అవయవ దానం అత్యున్నతమైనదని, మానవ జన్మకు మహా అవకాశమని, నేత్ర దానంతో అంధుల్లో వెలుగులు, అవయవదానంతో ఆరిపోయే ప్రాణాలకు ఆయుష్షును, దేహ దానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగ పడవచ్చునని, ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన అప్పల శెట్టి వీరయ్య ఇటీవల మరణించగా కుటుంబ సభ్యుల సహకారంతో సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి వారి ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. వారి దశదినకర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో డాక్టర్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశంసా పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేసి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన తర్వాత అవయవాలను కాల్చడం ద్వారా బూడిద పాలు, మట్టిలో పాతడం ద్వారా మట్టిపాలు చేయకుండా అవయవ దానం చేసి చిరంజీవులుగా మిగిలి పోవాలని తెలిపారు. భారతదేశంలో 12లక్షల మంది అంధులు ఇంతవరకు ప్రపంచాన్ని చూడలేక, నేత్ర దాతల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి, లయన్స్ క్లబ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు శైలజ, కీర్తిశేషులు అప్పల శెట్టి వీరయ్య కుటుంబ సభ్యులు అప్పలశెట్టి మురళీకృష్ణ నాగవాణి, గోపికృష్ణ, సాయి శృతి, భవిరిశెట్టి మాధవి, సంపత్ కుమార్, బూర్గుల రోహిణి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అన్నీ అమలు చేస్తాం

## పరకాల ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయ
## ఎమ్మెల్యే రేవూరి కృతజ్ఞత ర్యాలీ
## ఆరు గ్యారెంటీలలో రెండు పథకాలు అమలు
## విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా పరకాల పట్టణానికి చేరుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి వేద పండితులకు పూజలు చేశారు. శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి పూజా కార్యక్రమం నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు జై కాంగ్రెస్, జై రేవంత్ రెడ్డి, జై జై రేవూరి అనే నినాదాలతో పట్టణంలో హోరెత్తించారు. టపాకులు పేల్చారు. నాయకులు భారీ గజమాలతో రేవూరి ప్రకాశ్ రెడ్డి గారిని సత్కరించారు. అంబేద్కర్ సెంటర్ లో రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో పరకాల నియోజకవర్గ శాసనసభ్యుడిగా నన్ను గెలిపించిన నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు భవిష్యత్ భరోసాతో నన్ను గెలిపించిన ప్రతి యొక్కరి నమ్మకాన్ని వమ్ము చేయనని ఇంత పెద్ద ఎత్తున స్వాగతం పలికిన తీరు చూస్తుంటే ఇది విజయోత్సవ ర్యాలీ కాదు కృతజ్ఞత అభినందన ర్యాలీ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం కొలువుధీరిన తర్వాత ఏవైతే ఎన్నికలలో ఇచ్చినటువంటి 6 గ్యారెంటీలు ఉన్నాయో ఆ ఆరు గ్యారంటీల్లో భాగంగా శనివారం సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా రెండు పథకాలను అమలు చేశామన్నారు. ఇకపై పరకాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, పట్టణ అధ్యక్షుడు కోయడ శ్రీనివాస్ తో పాటు పరకాల మండల అధ్యక్షుడు కట్కూరు దేవేందర్ రెడ్డి, నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో రాజీవ్ ఆరోగ్య శ్రీ ప్రారంభం




**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి తర్వాత మొట్టమొదటిసారిగా భారీ ర్యాలీగా వర్ధన్నపేట గడ్డ మీద అడుగు పెట్టి అంబేద్కర్ విగ్రహం పూల వేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ నాకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించిన మీ అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి మీ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. తల్లి సోనియా గాంధీ ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సదుపాయం రూ.10 లక్షల పథకాన్ని సోమవారం వర్ధన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్ లో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ వెంకట రమణ, హాస్పిటల్ సూపర్ డెండెంట్ స్వామి, డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుతో మహిళ మృతి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన చెన్నారావుపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం ఇదే గ్రామానికి చెందిన గొట్టె సూరమ్మ (54) అనే మహిళ గ్రామ శివారులో పొయిల కట్టెల కోసం వెళ్లింది. పొయిల కట్టెలు సేకరిస్తుండగా పాము కాటుకు గురైంది. వెంటనే ఆమెను చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి భర్త సమ్మయ్య, కుమారుడు రాజు, కూతురు రమ ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com